నెలాఖరులోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం

పిఎం కిసాన్ పథకం కింద వచ్చే జనవరి లో విడుదల చేసే ప్రోత్సాహక మొత్తాలు రూ.2వేలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించు కోవాని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. రైతులు ఇకెవైసి చేయించుకొనేందుకు ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు వుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ నమోదు చేయించుకోని రైతులు వెంటనే తమ గ్రామంలోని రైతుభరోసా కేంద్రానికి వెళ్లి తమ వివరాలతో ఇకెవైసి నమోదు చేయించుకోవడం ద్వారా పిఎం కిసాన్ పథకం ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. జిల్లాలో విజయనగరం రూరల్, భోగాపురం, గరివిడి, పూసపాటి రేగ, గుర్ల, నెల్లిమర్ల, వేపాడ, కొత్తవలస, చీపురుపల్లి, డెంకాడ, రామభద్రపురం, రాజాం తదితర 12 మండలాల్లో సుమారు 60 వేల మంది రైతులు ఇంకా ఇకెవైసి చేయించుకోవాల్సి వుందన్నారు. జిల్లాలో 2.48 లక్షల మంది రైతులకు గాను 1.67 లక్షల మంది రైతులు మాత్రమే ఇప్పటి వదచీశీఅవగరకూ ఇకెవైసి చేయించు కున్నట్టు తెలిపారు.

పెరిగిన సైబర్ నేరాలు

- తగ్గని హత్యలు
- విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- సెల్‌ఫోన్ల రికవరీలో చురుకైన పాత్ర

మోసాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా దొంగలు కూడా దారిదోపిడీలు, దొంగతనాల తీరును మార్చుకుంటున్నారు. గడిచిన ఏడాదిలో దోపిడీలు, దొంగతనాలు తగ్గినప్పటికీ, సైబర్ నేరాలు పెచ్చుమీరడం ఇందుకు మచ్చుతునకగా చెప్పకోవచ్చు. జిల్లాలో హత్యలు కూడా తగ్గలేదు. వీటిలో లాభాపేక్షకన్నా వివాహేతర సంబంధాల కారణంగా చోటు చేసుకున్న హత్యలే ఎక్కువ కావడం గమనార్హం. జిల్లాలో మునుపెన్నడూ లేనంతగా గంజాయి క్రయ, విక్రయాలు సాగాయి. వీటిని అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారు. రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. ఆ మేరకు పోలీసుల గస్తీ, నిఘా పెరిగినట్టుగా స్పష్టమౌతోంది. గతంలో సెల్ ఫోన్ పోయిందంటే తిరిగి దొరకడం గగనమయ్యేది. ఇటీవల కాలంలో వాటి రికవరీకి జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంది. ఇక రోడ్డు ప్రమాదాల సంఖ్య, స్వల్పంగా మృతులు, క్షతగాత్రుల సంఖ్య తగ్గుముఖం పట్టాయి. అత్యాచారాలు, ఫోక్సో కేసుల సంఖ్య కూడా తగ్గింది. గిర్రున తిరిగే కాలచక్రంలో మరో నాలుగు రోజులు గడిస్తే మరో ఏడాది కరిగిపోతుంది. ఈ నేపథ్యంలో మన జిల్లాలో గడిచిన ఏడాదిలో జరిగిన దోపిడీలు, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, వాటిపై పోలీసులు స్పందించిన తీరు, శాంతి భద్రతల పరిరక్షణ వంటి విషయాలను తేటతెల్లం చేసేదే ఈ ప్రత్యేక కథనం.

రికవరీ చేసిన నగలను పరిశీలిస్తున్న ఎస్‌పి దీపిక (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది జిల్లాలో సైబరు నేరాలు, గంజాయి క్రయ, విక్రయాలు ఆందోళన కలిగించే అంశంగా మారాయి. 2021లో గంజాయి కేసులు 105 నమోదు కాగా, 2022లో 139 నమోదయ్యాయి. 2021తో పోలిస్తే ఈ ఏడాది 6 దోపిడీ కేసులు తగ్గాయి. హత్యకేసులు పెద్దగా తగ్గలేదు. 2021లో 24హత్యలు చోటు చేసుకోగా 2022లో 23 హత్య కేసులు నమోదయ్యాయి. హత్యల్లో చాలా వరకు అక్రమ సంబంధాలు కారణంగానే కేసులు నమోదు కావడం గమనార్హం. 2021లో లాభాపేక్ష హత్యలు 3 నమోదుకాగా, 2022లో అటువంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడం మంచి పరిణామమే. 2021లో 35 కేసులు నమోదుకాగా, 2022లో 12 హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. 2021లో 69మంది పిల్లలు తప్పిపోగా, 2022లో 82మంది తప్పిపోయారు. వీరందర్నీ తిరిగి వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు అప్పగించారు. గంజాయి అక్రమ రవాణదారులపై 2021లో 32కేసులు నమోదుకాగా, 2022లో 50 కేసులు నమోదు కావడం విశేషం. ఎక్కువగా యువత ఈ ప్రభావానికి గురౌతున్నట్టుగా స్పష్టమౌతోంది. దిశా యాప్ వినియోగంపై పోలీసులు ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. ఈ ఏడాది కేవలం 44మంది మాత్రమే యాప్ ద్వారా ఫిర్యాదు చేయడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. అయితే 19,192 ట్రైల్ రన్ చేశారు. మహిళలపై 2021లో 76 రేప్ కేసులు నమోదుకాగా, 2022లో ఈ తరహా కేసులు 50 కేసులు నమోదయ్యాయి. మహిళల గౌరవానికి భంగం కలిగించే కేసులు 2020లో 218నమోదుకాగా 2022లో 176 నమోదయ్యాయి. 2021లో పోక్సో 71 కేసులు నమోదుకాగా, 2022లో 44కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది 10శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. 2021లో రహదారి ప్రమాదాల్లో 222 కేసులు నమోదై, 238 మంది మతి చెందగా, 2022లో 216 కేసులు నమోదయ్యాయి. 216 మంది మతి చెందారు. పోలీసుల రహదారి భద్రతా చర్యలు ఇందుకు దోహదపడినట్టుగా స్పష్టమౌతోంది. ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోనులను తిరిగి అప్పగించడంతో పోలీసు శాఖ విజయవంతమైంది. జిల్లా ఎస్పి ఇందుకు ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేశారు. వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 544 మొబైల్స్ స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. 2022లో డిస్పోజ్ అయిన కేసుల్లో 60శాతం కేసులకు మాత్రమే శిక్షలు ఖరారు కావడం విస్మయానికి గురిచేస్తోంది. 2022లో 6,171 కేసులు డిస్పోజ్ కాగా, వాటిలో 3,698 కేసుల్లో నిందితులకు శిక్ష పడింది. జాతీయ లోక్ అదాలత్ పోలీసుశాఖ అత్యంత ప్రాధాన్యత కల్పించడంతో 4,294 ఎఫ్.ఐ.ఆర్. కేసులు, 18,393 పెటీ కేసులు డిస్పోజ్ అయ్యాయి. ఈ ఏడాది పేకాటరాయుళ్లపై 111 కేసులు, కోడిపందాలు ఆడినవారిపై 28 కేసులు, మద్యం తరలిస్తున్న వారిపై 780 ఎక్సైజ్ కేసులు, నాటుసారా తయారీ, రవాణదారులపై 461 కేసులు నమోదు చేశారు. జిల్లాలో 1,98,410 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఇసుక అక్రమ రవాణదారులపై మాత్రం 158 కేసులు మాత్రమే నమోదయ్యాయి.



పప్పుల చీటీంగ్



- 12500 మందికి టోకరా
- సుమారు రూ.4.50 కోట్లతో పరారైన నిర్వాహకురాలు
- లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఎస్ఎస్ఆర్‌పేటలో నిర్వాహకురాలి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి- గుర్ల, నెల్లిమర్ల

పప్పుల చీటీ పేరిట ఘరానా మోసం జరిగింది. 12 నెలలు, నెలకు రూ.300 చొప్పున డబ్బులు కడితే పండగ సమయానికి మీకు పండగకి సరిపడా కిరాణా సరుకులు ఇస్తామంటు నమ్మ బలికిన నిర్వాహకులు వేలాది మంది వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారు. తీరా సరుకులు ఇవ్వాల్సిన సమయం వచ్చే సరికి ఆ డబ్బుతో పరారయ్యారు. దీని వెనుక పెద్ద ముఠా ఉన్నట్లు తెలుస్తోంది.

గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటలో ఉంటున్న పతివాడ శ్రీలేఖ ఘరాన మోసానికి పాల్పడింది. పప్పులు చీటీల పేరుతో గుర్ల, నెల్లిమర్ల మండలాల్లో 12,500 మంది వద్ద నుంచి సుమారు రూ. 4.50 కోట్లు వసూలు చేసింది. వారందరికీ సంక్రాంతి కానుకగా సరుకులను ఇవ్వాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఆమె గ్రామంలో కనిపించకపోవడం, సెల్‌ఫోన్ స్విచాఫ్ రావడంతో ఆందోళనకు గురైన బాధితులు పెద్ద ఎత్తున ఆమె ఇంటికి చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం అక్కడి నుంచి గుర్ల పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఆమెపై ఫిర్యాదు చేశారు.

వాలంటీర్‌గా విధులు

శ్రీలేఖ నెలిమర్ల మండలం కొండగుంపాం గ్రామ సచివాలయంలో వాలంటీర్‌గా పనిచేస్తుంది. గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేటలో తన కన్నవారి ఇంట్లో ఉంటూ తొలుత పలువురుతో పప్పుల చీటీలు కట్టించింది. ప్రతి ఒక్కరి నుంచి నెలకు రూ.300 చొప్పున కట్టించుకుంది. ఇలా 12 నెలలు రూ.3600 కడితే సంక్రాంతి పండుగకి సరిపడా సామాన్లు ఇస్తామని నమ్మబలికింది. ఆమె పనిచేస్తున్న సచివాలయం పరిధిలోని కొండగుంపాం, గరికిపేట గ్రామాల్లో కూడా మహిళా వాలంటీర్లతో కలిసి డబ్బులు వసూలు చేసింది. ఇలా ఈ రెండు మండలాల్లో సుమారు 12500 మందిని చేర్చుకుని డబ్బులు వసూలు చేయించింది. విజయనగరం మండలంలోని కొండకరకాం గ్రామానికి చెందిన శ్రీలేఖ బంధువు మజ్జి అప్పలరాజు కూడా ఈ మోసంలో భాగస్వామిగా ఉన్నట్లు తెలిస్తోంది. అతనే ఈ కుంభకోణానికి ప్రధాన సూత్రధారిగా ఉన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అప్పలరాజు తన చుట్టూ పలువురు ఏజెంట్లని ఏర్పాటు చేసుకుని మరీ చీటీలు కట్టించి మోసానికి పాల్పిడనట్లు తెలిస్తోంది.

ఎలా బయట పడిందంటే

ఈ నెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా సభ్యులలో పలువురు క్రిస్టియన్లు తమకి సామాన్లు ఇవ్వవలసిందిగా కోరారు. రేపిస్తాను, ఎల్లుండిస్తాను అని శ్రీలేఖ చెప్పడం, రెండు రోజులు తరువాత సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడం, మనిషి కూడా కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు ఇంటికెళ్లి చూసేసరికి తాళం వేసి ఉండటాన్ని గమనించి కంగుతిన్నారు. ఒత్తిడి చేసినా సరుకులు ఇవ్వకుండా అప్పలరాజు అండ్ కో పరారైపోయ్యారని, తాము మోసానికి గురయ్యామని భావించి సభ్యులు ఆందోళనకు దిగారు. శ్రీలేఖ లాంటి వారిని చాలా మందిని అప్పలరాజు ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో చీటీల పేరిట డబ్బులు వసూలు చేయించి మోసానికి పాల్పడినట్లు తెలిస్తోంది. వారి చేతిల్లో మోసపోయిన బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిస్తోంది. ఈ కుంభకోణంలో అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రమేయం కూడా ఉందని బాధితులు ఆరోపించడం కొసమెరుపు..


మున్సిపల్ కమీషనర్ గారి కార్యాలయము
విజయనగరం (అర్బన్) మున్సిపాలిటి
విజయనగరం జిల్లా.
తేది : 21/12/2022

ఆర్.సి. నెం నోటీసు / పింఛన్ నెంబర్ : 10269855

నోటీసు

SERVICE No:121101K034039022,121101K047027585,121101K094036439,

మున్సిపల్ కమీషనర్

కార్పొరేషన్ అధికారులు అందించిన నోటీసు

పింఛన్.. పరేషాన్!

- 1542 పింఛన్ల రద్దుకు రంగం సిద్ధం
- ఇప్పటికే నోటీసులు అందించిన అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'ప్రతి అవ్వను, ప్రతి తాతను మనుమడిలా ఆదుకునే బాధ్యత నాది. అధికారంలోకి రాగానే పింఛన్‌ను రూ.3వేలు ఇస్తాం' అంటూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. రూ.3వేలు పెంచలేదు సరికదా పూర్తిగా పెన్షనే లేకుండా చేసే పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. నిబంధనల పేరిట పింఛన్లను రద్దు చేసేందుకు చర్యలు ముమ్మరం చేసింది.

పింఛను లబ్ధిదారులకు 300 యూనిట్ల కరెంట్ బిల్లు దాటకూడదని, సొంత ఇల్లు వెయ్యి చదరపు అడుగులు ఉండకూడదని నిబంధన విధించి పింఛను ఎత్తివేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. పెన్షన్ల సంఖ్య తగ్గించుకోవాలన్న నిర్ణయంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రక రకాల నిబంధనలు పేరుతో పెన్షన్‌ల కుదింపునకు సిద్ధమైంది. అందులో భాగంగానే మీకు కరెంట్ బిల్ 300 యూనిట్లు దాటినందున మీ పెన్షన్ రద్దు చేస్తున్నామంటూ నగర పాలకసంస్థ అధికారులు పలువురు లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. విజయనగరంలో ఇప్పటి వరకు 26,430 పింఛన్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తాజా ఆదేశాతో 1542 మంది పెన్షనర్లకు నోటీసులు జారీ చేశారు. అభ్యంతరాలను 15 రోజులలో చెప్పాలని అందులో పేర్కొన్నారు. అయితే నోటీసులు ఇచ్చిన 1542 మందిలో సుమారుగా 90శాతం మంది పెన్షన్ నిలిచి పోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఈనెల 21తేదీ నుంచి నోటీసులు జారీ చేశారు. జనవరి 5వ తేదీ లోగా రాత పూర్వక లేఖలు ను బట్టి పెన్షన్లు తొలగించనున్నారు.

వాలంటీర్లే సంధానకర్తలు

వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-బొండపల్లి

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వాలంటీర్లు సంధానకర్తలుగా పనిచేయాలని వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి సూచించారు. సోమవారం బొండపల్లి మండలం గొట్లాంలో వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, వాలంటీర్ పరిధిలో ఇద్దరు గృహ రథసారథులను త్వరగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాలంటీర్లు ప్రభుత్వం తరుపున పనిచేస్తే, కన్వీనర్లు పార్టీ తరుపున పనిచేయాలని తెలిపారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. టిడిపి హయాంలో బిసిలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, పి.విక్రాంత్, ఎంపిపిలు చల్ల చలంనాయుడు, బెల్లాన జ్ఞానదీపిక, గేదెల సింహాద్రి అప్పలనాయుడు, పీరుబండి హైమావతి, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, గార తవుడు, రౌతు రాజేశ్వరి, వర్రి నరసింహమూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు బివి ప్రభూజి, మహంతి రమణ, గొల్లు సతీష్‌కుమార్, వైస్ ఎంపిపిలు మీసాల సరోజిని, గొండెల ఈశ్వరరావు, వైసిపి మండలాధ్యక్షులు ఈదుబిల్లి కృష్ణ, బూడి వెంకటరాం, కడుబండి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి

బొబ్బిలి : 2024 ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం ఐక్యంగా పని చేయాలని వైసిపి ఉత్తరాంధ్ర పరిశీలకులు వైవి సుబ్బారావు, మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. టిబిఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి హయాంలో నియమించిన జన్మభూమి కమిటీలు అవినీతికి పాల్పడితే, వైసిపి హయాంలో వాలంటీర్లు రాజకీయాలకు, అవినీతికి అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. బిసిలకు వైసిపి పెద్దపీట వేస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, నాయకులు తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు, శంబంగి వేణు, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను కాలరాస్తున్న మిల్లర్లు

డిప్యూటీ సిఎం ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి-మెంటాడ

ధాన్యం కొనుగోలు విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు.. డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను కాలరాస్తున్నారని వాపోయారు. మండల కేంద్రం మెంటాడలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయో, లేదోనని ఆరాతీశారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణలో ఎదురవుతున్న సమస్యలను రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదనంగా ధాన్యం తూకంతో వస్తేనే మిల్లర్లు తీసుకుంటున్నారని వివరించారు. వెంటనే డిప్యూటీ సిఎం స్పందిస్తూ ఉన్నతాధికారులతో చర్చించి రైతులకు న్యాయం చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, మెంటాడ సర్పంచ్ రేగిడి రాంబాబు, ఎంపిటిసి పతివాడ కుమారి, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, హౌసింగ్ ఎఇ డేవిడ్ ప్రసన్న కుమార్, ఎపిఎం దేవుడుబాబు, మెంటాడ పిఎసిఎస్ అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, లోతుగెడ్డ, జగన్నాథపురం సర్పంచులు భీమారావు, బంకపల్లి ప్రసాదరావు, నాయకులు దంతులూరి రంగరాజు, సిరిశెట్టి నారాయణరావు, రెడ్డి రాజప్పలనాయుడు, పాంద్రంకి సన్యాసిరావు, దంతులూరి వెంకట చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంకు సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

నేడు, రేపు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలోనిపలు ప్రాంతాలకు మంగళ, బుధవారాల్లో నీటి సరఫరా జరగదని డిఇ అప్పారావు ఒక ప్రకనటలో తెలిపారు. ముషిడిపల్లి పంపింగ్ స్టేషన్ నుండి విజయనగరం వరకు గల పైపులైను లీకులు అరికట్టే పనులు నిమిత్తం మంగళ, బుధవారాల్లో 17,18,19,0,21, 22,23,24, 25,32,33,34, 35,36,37,38,39,40, 41,42,43 44,46, 47 వార్డులకు మంచినీటి సరఫరా అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

స్పందనకు 133 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన ప్రజల నుంచి వివిధ సమస్యలపై 136 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 72 ఉన్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

స్పందనలో వినతి అందజేసేందుకు వచ్చిన చామలాపల్లి దళితులు, వ్యకాస నాయకులు

బకాయి జీతాలు చెల్లించాలని వినతి

విజయనగరం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం బకాయి జీతాలు చెల్లించి సమస్యలుపరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్లు సోమవారం స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు ఎం.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నెం. 680 ప్రకారం రూ. 10వేలు జీతం చెల్లించాలన్నారు.. గుర్తింపు కార్డులు, ప్రమాద భీమా రూ. 20లక్షలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఇయస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిక్షాల రిపేర్లు ఖర్చులు ప్రభుత్వం భరించాలని, కార్మిలకు భద్రత పరికరాలు ఇవ్వాలని కోరారు.

చారిత్రక గంటస్థంభాన్ని కాపాడండి

విజయనగరంకోట : చారిత్రక కట్టడమైన గంటస్తంభం చుట్టూ ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్ వలన గంటస్తంభం నిర్మాణానికి ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉన్నదని, తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు టిడిపి నాయకులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా నగర పార్టీ అధ్యక్షులు లక్ష్మీవర ప్రసాద్ మాట్లాడుతూ నగర సుందరీకరణకు తాము ఆటంకం కాదని, అయితే ఎన్నో ఏళ్లగా అతి పురాతనమైన చరిత్ర కలిగిన గంట స్తంభం చుట్టూ ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్ భూ అడుగుభాగము చుట్టూ ఉన్న గోడలు తడిచి కట్టడం కూలిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు,. బొద్దల నర్సింగరావు, కనకల మురళీమోహన్, కంది మురళి నాయుడు పాల్గొన్నారు.

మోసగించిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-వేపాడ

నిరక్షరాసులైన తమను మోసగించి భూములను కాజేసిన, అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని చామలాపల్లి దళితులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ సూర్యకుమారికి వినతి అందించారు. గ్రామానికి చెందిన కొంతమంది వారి స్వార్థ ప్రయోజనాల కోసం మాయమాటలు చెప్పి విశాఖ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి అయిన కట్టా కాశీవిశ్వనాథం కుటుంబం పేరిట తప్పుడు ధ్రువపత్రాలతో భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరించారు. కలెక్టర్ సూర్యకుమారి వెంటనే స్పందిస్తూ తప్పుడు ఆధారాలతో రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై విచారణ చేపట్టి, క్రిమినల్, ఛీటింగ్ కేసులు నమోదు చేయాలని ఎస్‌సి కార్పొరేషన్ ఇడిని ఆదేశించారు. అర్జీదారుల వద్ద స్టేట్‌మెంట్ తీసుకుని తనకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఆర్.ఆనంద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు మద్దిల రమణ, బాధిత దళితులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అంగన్‌వాడీల ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆయాలకు కార్యకర్తలుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు చేపట్టిన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎ. సూర్యకుమారి తెలిపారు. ఉద్యోన్నతి కల్పించేందుకు హామీ ఇస్తూ పలువురు వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఉద్యోగోన్నతుల కోసం ఎవరూ డబ్బులు చెల్లించవద్దని పేర్కొన్నారు. ప్రమోషన్ ఆశిస్తున్న వారు ఎలాంటి పైరవీలకు పాల్పడవద్దని సూచించారు. రెవెన్యూ డివిజన్ అధికారుల ఆధ్వర్యంలో అభ్యర్థుల జాబితాను రూపొందించి అర్హులకు పారదర్శకంగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు ప్రక్రియను చేపడుతున్నామని, ఎవరూ ఆందోళనకు గురి కావలసిన అవసరం లేదని తెలిపారు.

ఇకనైనా వైసిపి తీరు మారాలి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

చంద్రబాబునాయుడు జిల్లాలో చేపట్టిన మూడు రోజుల పర్యటన విజయవంతమైందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు తెలిపారు. టిడిపికి వస్తున్న స్పందన చూసైనా వైసిపి ప్రభుత్వ తీరు మారాలని అన్నారు. సోమవారం తన బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తెలియజేయడానికే చంద్రబాబు పర్యటన సాగిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అన్నింటిపైనా పన్నులు వేసి ప్రజలను హింసిస్తోందని తెలిపారు. రాజ్యాంగ వ్యతిరేక చట్టాలు చేయడం ఇకనైనా ఈ ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. విజయనగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అతిథి గజపతిరాజు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అనేక విన్నపాలను చంద్రబాబుకు తెలియజేశామని తెలిపారు. ప్రజలు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కంది మురళి నాయుడు, నగర కార్యదర్శి బంగార్రాజు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రీడలకు వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ షటిల్ కోర్టులో రాష్ట్ర స్థాయి షటిల్ టోర్న మెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించేందుకు జగనన్న క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడలలో యువత రాణించాలని కోరారు. క్రీడా పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 30 జట్లు హాజరయ్యాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, తదితరులు పాల్గొన్నారు.

షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

నేటి నుంచి మహారాష్ట్ర, ఆంధ్ర రంజీ మ్యాచ్

విజయనగరంటౌన్ : స్థానిక చింతలవలస పివిజి రాజు ఎసిఎ క్రికెట్ మైదానంలో మంగళవారం నుంచి మహారాష్ట్ర, ఆంధ్ర రంజీ మ్యాచ్ జరగనుంది. మహారాష్ట్ర జట్టులో అంతర్జాతీయ క్రీడాకారులు రుతురాజ్ గైక్వాడ్, రాహుల్ త్రిపాఠి, ఆంధ్ర జట్టులో కెఎస్ భరత్, హనుమ విహారి ఉన్నారు.

కుమ్మరి వృత్తిదారులకు 'జగనన్న చేదోడు'

విజయనగరం : కుమ్మరి వృత్తిదారులకు జగనన్న చేదోడు పథకాన్ని వర్తింపజేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి అంగీకరించారని కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మండేపూడి పురుషోత్తం తెలిపారు. త్వరలో దీనికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయని చెప్పారు. కుమ్మరి శాలివాహన జిల్లా సంక్షేమ కమిటీ సభ్యులుగా ఉప్పిలెట్టి అప్పలస్వామి, స్వయంభూకుల కనకారావు, దొడ్డిగల్ల పాపారావు, అరటికట్ల లక్ష్మి నియమితులయ్యారు. వీరికి నియామక పత్రాలను సోమవారం కలెక్టర్ ఎ.సూర్యకుమారి అందజేశారు. జిల్లాలో కమ్యూనిటీ హాల్ నిర్మించుకొనేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు చైర్మన్ పురుషోత్తం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమాధికారి యశోదరావు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

విజయనగరం : ధాన్యం విక్రయాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన 'రైతులకు రవాణా పాట్లు' అనే వార్తకు ఆయన స్పందించారు. గోనె సంచులు, ధాన్యం రవాణాలో రైస్ మిల్లర్ల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే అన్నీ ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. రైతులు ఏర్పాటు చేసుకునే గోనె సంచికి రూ.3.39పైసలు, ధాన్యం రవాణాకు 8 కిలోమీటర్ల వరకు టన్నుకు రూ.295 చెల్లిస్తామని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన ధాన్యం రవాణాకు ఛార్జీల కింద రూ.69లక్షలు చెల్లించినట్లు పేర్కొన్నారు. అదనపు కేజీల విషయంలో రైతులకు సమస్యలు తలెత్తకుండా రైసు మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల ధర్నా

విజయనగరం టౌన్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సోమవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎఫ్, ఇఎస్ ఐ బకాయిలు చెల్లించాలని, ఎల్ఐసి, ఎపిజిఎల్ఐ రుణాలు మంజూరు చేయాలని, డిఎ బకాయిలు చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, సిఫార్సు బదిలీలు ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా లో ఈ సంఘం నాయకులు ఎ.సరాసరావు,ఆర్.కృష్ణ, ఎవి పైడిరాజు, ఎవి శ్రీనివాసరావు, మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనర్హుల జాబితా పరిశీలన

వేపాడ : మండలంలో సామాజిక పింఛన్లకు అనర్హులుగా వచ్చిన 72 మంది జాబితాను సోమవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ పరిశీలించారు. ఆతవలో 7, బల్లంకిలో 6, బానాదిలో 4, బొద్దాంలో 9, డిఆర్‌పేటలో 3, జాకేరులో 2, జెడ్‌పురంలో 4, కొంపల్లిలో 4, ఎకెఎస్‌ఆర్‌పురంలో 6, నల్లబిల్లిలో 1, పాటూరులో 2, ఆర్ఎస్‌పేటలో ఒకటి, సింగరాయిలో 6, సోంపురంలో 3, వల్లంపూడిలో 3, వేపాడలో 4, వావిలపాడులో 3, వీలుపర్తిలో 2 పింఛన్లకు సంబంధించి తగిన ఆధారాలు చూపించాలని వారు తెలిపారు. ఈ పరిశీలనలో ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ పరిశీలన

వేపాడ : లక్కవరపుకోట మండలం పిల్లాగ్రహారంలోని రైస్‌మిల్లును ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సోమవారం పరిశీలించారు. వేపాడ మండలంలోని రైతుభరోసా కేంద్రాల నుంచి సేకరిస్తున్న ధాన్యాన్ని ఆ రైస్‌మిల్లుకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైస్‌మిల్లు వద్ద ఇప్పటివరకు తీసుకున్న ధాన్యం, రైతుల వివరాలపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. రైతుల నుంచి తీసుకున్న ధాన్యానికి బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు, సిబ్బందికి సూచించారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

విజయనగరం : నగరంలోని తోటపాలెం యుపి పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సోమవారం 32, 33 డివిజన్ల కార్పొరేటర్లు భోగాపురపు లక్ష్మి , జివి రంగారావు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న ఈ ట్యాబ్‌లను ఉపయోగించుకొని విద్యార్థులు చదువులో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు భోగాపురపు రవిచంద్ర, రెడ్డి గురుమూర్తి, ఆర్లె కృష్ణారావు , తుమ్మగంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్, స్కేటింగ్ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్ : అండర్ 14, 17 విభాగాల్లో స్కూల్ గేమ్స్ బాక్సింగ్, స్కేటింగ్ జిల్లా జట్ల ఎంపిక సోమవారం చేపట్టారు. స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో బాక్సింగ్, విజ్జీ మైదానంలో స్కేటింగ్ జట్లను ఎంపిక చేశారు. ప్రతిభ ఆధారంగానే ఎంపికలు నిర్వహించామని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్‌వి రమణ తెలిపారు. బాలుర అండర్-14 జట్టుకు 11 మంది, అండర్-17 జట్టుకు 13 మందిని, బాలికల అండర్-17 జట్టుకు ఐదుగురిని ఎంపికచేశారు. బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు, మురళీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు నాని ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు.

సచివాలయ నిర్మాణంపై వినతి

డెంకాడ : డెంకాడ గ్రామంలో జెడ్‌పి స్కూల్‌లో ఇది వరకు ఉన్న పాఠశాల భవనాన్ని పడగొట్టి ఆ ప్రదేశంలో సచివాలయాన్ని నిర్మించడాన్ని కండిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ స్పందనలో వినతి పత్రాన్ని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో డెంకాడ టిడిపి నాయకులు కలిదిండి పాణీరాజు, మాజీ సర్పంచ్ కోయనేని రమణ, ఎంపిటిసి కోరాడ కుమారి, చలుమూరి కిషోర్, రాజారావు తదితరలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లిమర్ల : ఆర్‌టిసి బిసి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎపిఎస్ ఆర్‌టిసి జోనల్ చైర్ పర్సన్ గదల బంగారమ్మ ఆవిష్కరించారు. సోమవారం మండలంలోని కొండవెలగాడ గ్రామంలో తన స్వగృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌పి శేషగిరిరావు, ఎపి సి.ఎస్.వి కార్పొరేషన్ డైరెక్టర్ డి.వామనాచారి, అసోసియేషన్ సలహాదారులు మమ్ముల తిరుపతిరావు, విజయనగరం జోనల్ సభ్యులు టి. పార్థసారధి, ఎస్. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సూరిబాబు సేవలు మరువలేనివి

నెల్లిమర్ల : జరజాపుపేట మాజీ సర్పంచ్ కీర్తిశేషులు నల్లి అప్పల సూర్యనారాయణ (సూరిబాబు) సేవలు మరువలేనివని నగర పంచాయతి వైస్‌ఛైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. సోమవారం జరజాపు పేటలో మాజీ సర్పంచ్ సూరిబాబు వర్ధంతిని వేడుకలు కుటుంబ సభ్యులు నల్లి చంద్ర శేఖర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బొని బంగారు నాయుడు, కానిస్టేబుల్ మద్దిల ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పోలుబోతు నారాయణ మూర్తి, ఎంఎం నాయుడు, నల్లి శ్రీను, మద్దిల శ్రీను, టిడిపి నాయకులు అవనాపు సత్య నారాయణ, కాళ్ళ రాజ శేఖర్, మాత గోపి తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపేట మాజీ సర్పంచ్‌కు పితృ వియోగం

నెల్లిమర్ల : చంద్రంపేట మాజీ సర్పంచ్ కర్రోతు వెంకట రమణ తండ్రి, ప్రస్తుత సర్పంచ్ కర్రోతు అప్పల కొండ మామ కర్రోతు వెంకట సత్యం (92) సోమవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల వైసిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ వెంకట రమణకు సానుభూతి తెలిపారు.

సేవలు స్ఫూర్తిదాయకం

విజయనగరం టౌన్ : వంగవీటి మోహన్ రంగా 34వ వర్ధంతి సోమవారం స్థానిక జిఎస్‌ఆర్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గురాన అయ్యలు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు రంగా చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. వంగవీటి రంగా మరణించి 34 ఏళ్ళు గడిచినా ఆయనపై ప్రజలకు అభిమానం ఏ మాత్రం చెక్కుచెదరలేదని అన్నారు. కార్యక్రమంలో పవన్ కుమార్ , మణికంఠ,మహేష్ ,బాష, రాజేష్ ,అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో మామ, అల్లుడు దుర్మరణం

వీరఘట్టం : మండలంలోని చిన గోరా కాలనీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామ, అల్లుడు మృతి చెందారు. పోలీసులు, గ్రామస్తులు చెప్పిన వివలిలా ఉన్నాయి. మండలంలోని కె.ఇచ్చాపురం పంచాయతీ రామాపురానికి చెందిన కూరంగి చిరంజీవి (52), తన మామ ఉయ్యక సత్యం(60) పొలం పనులు ముగించుకుని సోమవారం వనజ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు చిన ఘోర కాలనీ సమీపంలో ఢీకొట్టింది. దీంతో మామ, అల్లుడికి తీవ్ర గాయాలయ్యాయి.108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ఆటోలో వీరఘట్టం పిహెచ్‌సికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిరంజీవి మృతి చెందాడని, సత్యంను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై హరికృష్ణ తెలిపారు. వీరి మరణంతోగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చిరంజీవి భార్య చిన్నమ్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భద్రతా చర్యలతో ప్రమాదాల నివారణ

- గంజాయిని అరికట్టేందుకు వ్యూహాత్మక చర్యలు
- సమర్థవంతంగా మహిళా సంరక్షణ
- సైబర్ నేరాలపై మరింత నిఘా
- విలేకర్ల సమావేశంలో ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తాము చేపట్టిన రహదారి భద్రతా చర్యల వల్లే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమైందని జిల్లా ఎస్‌పి ఎం.దీపిక పాటిల్ తెలిపారు. గంజాయి దిగుమ, క్రయ, విక్రయాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటుతామని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై మరింత నిఘావేస్తామని చెప్పారు. సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటున్నామని తెలిపారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసులు, ముఖ్యమైన పరిణామాలు, శాంతిభద్రత చర్యలను వివరించారు. రహదారి భద్రత చర్యల్లో భాగంగా 2021లో డ్రంకెన్ డ్రైవ్ కేసులు 1,063 కేసులు నమోదుకాగా, 2022లో 5,397 కేసులు నమోదు చేసామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 2021లో 6,969కేసులు నమోదుకాగా, 2022లో 10,160 కేసులు నమోదు చేసామన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసినవారిపై ఈ ఏడాది 4,823 కేసులు నమోదు చేశామని తెలిపారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పించి, ప్రతీ శనివారాన్ని రోడ్డు ప్రమాదాలు జరగకుండా "నో ఏక్సిడెంట్ డే" పరిగణించి, భద్రత చర్యలు చేపడుతున్నామన్నారు. ఈనేపథ్యంలో ప్రమాదాల సంఖ్య గతంతో పోలిస్తే తగ్గాయన్నారు.

మహిళలపై జరిగే నేరాలను నిరోధించేందుకు మహిళలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా జిల్లాలో దిశ జాగృతి యాత్రను 10రోజులు నిర్వహించి, పాఠశాల విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చామని తెలిపారు. మహిళా సంరక్షణ పోలీసుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, వారితో ప్రజలకు లోన్ యాప్స్, దిశ ఎస్.ఒ.ఎస్. యాప్, సైబరు నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత చర్యల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు.

గ్రామ స్థాయిలో సారా నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా సారా ప్రభావిత 77గ్రామాలను గుర్తించి, ఆయా గ్రామాల్లో పూర్తిగా సారాను నిర్మూలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. 79 కుటుంబాలను గుర్తించి, వారికి జిల్లా కలెక్టర్ సాయంతో 121మందికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు రూ. 43.31 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. గంజాయి కేసుల్లో ఈ ఏడాది 89మందిని అరెస్టు చేసి, వారినుండి 3,180.855 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సైబరు నేరాల నియంత్రణకు మహిళ పోలీసులతో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చెపట్టినట్లు తెలిపారు. ఈ-శిక్షణ కేంద్రాన్ని ప్రత్యేకంగా ప్రారంభించి పోలీసు స్టేషను స్థాయిలో ప్రతీ కానిస్టేబులుకు కంప్యూటరు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ ఏడాది రవి జ్యూవలరీ షాపులో ఫిబ్రవరిలో జరిగిన చోరీకేసును 24గంటల వ్యవధిలో ఛేదించి, 1.180 కిలోల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. మోటారు సైకిలు డిక్కీనుండి తస్కరించబడిన రూ.5.30 లక్షల నగదును 48 గంటల్లోనే ఛేదించామన్నారు. పూసపాటిరేగ పోలీసు స్టేషను పరిధిలో హత్య కేసును రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితులు చేసిన ప్రయత్నాన్ని భగ్నం చేసి, నిందితులను అరెస్టు చేసి, హత్య మిస్టరీని ఛేదించామని ఎస్‌పి దీపిక వివరించారు.

పోగొట్టుకున్న 117 మొబైల్స్ బాధితులకు అందజేత

విజయనగరం : జిల్లాలో పోయిన మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు గత నెలలో జిల్లా ఎస్‌పి ప్రారంభించిన వెబ్‌పోర్టల్ సత్ఫలితాలు ఇస్తోంది. ఆ వెబ్ పోర్టల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు సైబర్ పోలీసులు, సిబ్బంది నిరంతర చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే రూ.20.15లక్షలు విలువైన 117 స్మార్టు ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ మొబైల్స్‌ను బాధితులకు అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోయిన ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్నవారు ఈ మొబైల్స్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటిని రికవరీ చేయడంలో ఎంతో శ్రమించిన సైబర్ సెల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్‌కుమార్, కానిస్టేబుళ్లు వాసుదేవరావు, ఎం.శ్రీనివాసరావు, రాజేష్, తిరుపతినాయుడులను అభినందించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐ రుద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో వినతులు స్వీకరణ

అంతకుముందు జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన స్పందనలో పలువురు నుండి ఎస్‌పి ఎం.దీపిక వినతులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడారు. సత్వర చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సిఐలు మురళి, రుద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు నోటీసులపై ఆందోళన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని పలు గ్రామాల్లో 170 మందికి పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేయడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నో ఏళ్ల నుంచి పింఛన్లు తీసుకున్నప్పటికీ అనేక రకాల ఆంక్షలతో పింఛన్ తొలగింపు నోటీసులు జారీ చేయడం సరికాదని సామాజిక పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.300లకు పైబడి విద్యుత్ బిల్లు వచ్చిన, 3 ఎకరాలు పైబడి భూములున్నా, ఇన్ కామ్ టాక్స్, వెయ్యి చదరపు గజాల నివాస గృహాలు ఉన్న పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులో పేర్కొనడాన్ని తప్పుబడుతున్నారు. ఒకపక్క పింఛన్ పెంచారని సరదా, మరో పక్క పూర్తిగా పింఛన్ పోతుందని భయంతో వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి ఆధార్, తెల్ల రేషన్ కార్డు ప్రాప్తికే పెన్షన్లు ఉండేలా చూడాలని ఆయా నోటీసులు ఇచ్చిన పింఛన్ లబ్ధిదారులు కోరుతున్నారు.

పింఛన్లు తొలగించడం దుర్మార్గం

నెల్లిమర్ల : ప్రభుత్వం నిబంధనల పేరిట పింఛన్లు తొలగించడం దుర్మార్గమని సిఐటియు మండల నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. సోమవారం ఆయన నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ నగర పంచాయతి పరిధిలో నిబంధనల పేరిట ప్రభుత్వం పింఛన్లు తొలగించడం అన్యాయమన్నారు. నెల్లిమర్ల, జరజాపు పేట ప్రాంతాల్లో సుమారు నాలుగు వందల మంది పింఛన్లు ప్రభుత్వం తొలగించడాన్ని ఖండించారు. ఇంటి విస్తీర్ణం పెరుగుదల, విద్యుత్ బిల్లులు అధికం, ఆదాయ పన్ను చెల్లింపు, భూములున్నాయని పేరిట అర్హుల పింఛన్లు తొలగించడం సమంజసం కాదన్నారు. పింఛన్‌తో జీవనం సాగిస్తున్న వీరికి జీవితం చరమాంకంలో నిబంధనలు పేరుతో పింఛన్లు తొలగించడం ప్రభుత్వం చేతకాని తనమని కనిపిస్తోందన్నారు. ఇప్పటికే పింఛన్లు తొలగించారని సమచారం రావడంతో పింఛన దార్లు ఆందోళన చెంది నిరాశతో మంచం పట్టిన పరిస్థితులు ఉన్నాయన్నారు. కాబట్టి తొలగించిన పింఛన్లను పునరుద్ధరణ జరపాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో పింఛనదార్లు ఆందోళన చేస్తారని హెచ్చరించారు.

ర్యాలీ చేపడుతున్న సిఐటియు నాయకులు, పలు గ్రామాల ప్రజలు

దేవాడ బెల్టు మైనింగ్ లీజును రద్దు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి-గరివిడి

దేవాడలో బెల్టు మైనింగ్ లీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక రైల్వేగేటు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ మాట్లాడుతూ దేవాడ బెల్టు పరిధిలో గల దువ్వాం, కోడూరు, కొండపాలెం, దేవాడ గ్రామపంచాయతీ చెందిన 225 ఎకరాల్లో 65 లక్షల టన్నుల మాంగనీస్ ఓర్ ఉందని, దీన్ని తవ్వుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ - టెండర్ ద్వారా మహాలక్ష్మి మినరల్స్ అనే కంపెనీకి మంజూరు అనుమతిచ్చిందని మండిపడ్డారు. ఇక్కడ ఉన్న ఖనిజాలను తవ్వుకొని ఇతర ప్రాంతాలకు తరలించు పోవడానికి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో పలు గ్రామాల ప్రజలు వ్యతిరేకించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ మైనింగ్ చేస్తే గ్రామాలన్నీ దుమ్మి దూళితో నిండిపోతాయని, ప్రజలు అనారోగ్యం బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటు పోతాయని, తాగునీరు కూడా నోచుకోనే పరిస్థితులు ఉండవని ప్రజలంతా గగ్గోలు పెట్టినా ప్రభుత్వం ఆ అనుమతులు రద్దు చేయలేదని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి మైనింగ్ లీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆ ఘనత కార్యకర్తలదే

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బొబ్బిలిలో నిర్వహించిన టిడిపి అధినేత చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బహిరంగ సభ విజయవంతమయ్యేలా కృషి చేసిన ఘనత పార్టీ కార్యకర్తలకు, నాయకులకు దక్కుతుందని చెప్పారు. ప్రతిఒక్కరూ ఇంటింటికీ తిరిగి, అహర్నిశలు శ్రమించడంతో జన సముద్రాన్ని తలపించేలా ప్రజలు హాజరయ్యారని తెలిపారు. పార్వతీపురం, కురుపాం, సాలూరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, సీతానగరం, బలిజిపేట మండలాల నాయకులకు కూడా కృతజ్ఞతలు తెలియజేశారు.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా

టిడిపి నాయకులు గొంప కృష్ణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభకు నియోజకవర్గం నుండి వేలాదిగా ప్రజలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారని, అందుకు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని టిడిపి నాయకులు గొంప కృష్ణ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రయివేట్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గొంప కృష్ణ మాట్లాడారు. కార్యకర్తలే పార్టీకి ఆక్సిజన్ లాంటి వారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, టిడిపి విశాఖ పార్లమెంటు ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్, నానిగిరి రమణాజి, కొనదం మల్లేశ్వరరావు, వేపాడ మండల నాయకులు గొరపల్లి రాము, భారతి, జామి నాయకులు పైడిరాజు, జుత్తాడ రామసత్యం పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని 475 యూనియన్ అధ్యాపకుల ఉపాధ్యక్షులు ఎం. ఈశ్వర వెంకటరావు అన్నారు. ఈ మేరకు రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కంబాల జోగులను సోమవారం వంగరలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని, సెలవులు ఇప్పించాలని, మేనిఫెస్టోలో ఉన్న అంశాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు ఎస్.సురేష్, బి.కృష్ణారావు, వై.గీత, కె.శ్రీనివాసరావు, ఎస్. శ్యామలాదేవి పాల్గొన్నారు.

సామాజిక భవనాన్ని గ్రంథాలయానికి కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పాటూరు గ్రామంలో ఖాళీగా ఉన్న సామాజిక భవనాన్ని గ్రంథాలయంగా నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ఎంపిపి దొగ్గ సత్యవంతుడుకు ఆ గ్రామ యువత వినతి పత్రం అందజేశారు. వెంటనే ఎంపిపి స్పందిస్తూ గ్రంథాలయానికి వినియోగించుకునేలా గ్రామ సచివాలయ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తానని హామీనిచ్చారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-వేపాడ

వైసిపి హయాంలో గడపగడపకూ సంక్షేమ పథకాలు చేరువయ్యాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని బల్లంకి గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి శానాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వర్‌రావు, సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి, వార్డు సభ్యులు బొడ్డు శ్రీను, నాయకులు బల్లంకి కనకరాజు, బీల సతీష్, బాలబాబు, డిసిసిబి చైర్మన్ వివి చిన రామునాయుడు, తహశీల్దార్ కృష్ణంరాజు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు నిరుజోగి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

నగరంలో కోలగట్ల పర్యటన

విజయనగరం టౌన్ : గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం 36వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా 34 డివిజన్ తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు శ్యామలాదేవి కోలగట్ల సమక్షంలో వైసిపిలో చేరారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులతో ముఖ్యంగా మహిళలు పార్టీలోకి చేరడం అభినందనీయమన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చి ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ బాలి పద్మావతి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బాలి పైడిరాజు, చందక శ్రీనివాసరావు, డివిజన్ ఇన్చార్జ్ కె.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బాలి నరేంద్ర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

'విఎస్ఎస్ బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వెలమ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఆ సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి కోటేశ్వరరావు, చప్ప శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం వెలమ సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గౌరవ సలహాదారుల కమిటీగా గోగాడ సూరిదేముడు, మెరుపుల నారాయణ మూర్తి, జి.ఎస్.నాయుడు, డాక్టర్ రంధి త్రినాథరావు, చీపురుపల్లి వెంకటరావు, నిరుజోగి హరనాథ్, గేదల బంగారునాయుడు వ్యవహరిస్తారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు రెడ్డి ఉమామహేశ్వరావు, రాయవరపు శ్రీను, గూనూరు వెంకటరావు, చలుమూరి కూర్మారావు, పెంట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యలో రాణించాలి

ప్రజాశక్తి - వంగర

పేద విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విద్యారంగంలో రాణించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. వివిధ గ్రామాలలో 14 ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ ఇటీవల ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు నాడు నేడు పనులతో పాఠశాలలు అభివృద్ధి చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని భవిష్యత్తులో మరిన్ని మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. అనంతరం ఇటీవల సైన్స్ ప్రతిభా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సురేష్ ముఖర్జీ, మండల వైసిపి కన్వీనర్ కరణం సుదర్శన రావు, తహశీల్దార్ డి. ఐజాక్, ఎంపిడిఒ శంకరరావు, ఎంఇఒ యాగాటి దుర్గారావు, ప్రధానోపాధ్యాయులు ఎం. రవణమ్మ, దొర మాస్టర్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగులు

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని చినరావుపల్లి గ్రామంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కంటకాపల్లి చర్చి పాస్టర్ అల్లం జాన్ విక్టర్ పాల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలు వేడుకలు శాంతికి చిహ్నంగా నిలుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ బి.రక్షణ ఆనంద కుమార్, ఎల్.కోట ఎంపిపి జి.శ్రీనివాసరావు, చినరావుపల్లి సర్పంచ్ బుసాల దేముడు, కాటకాపల్లి సర్పంచ్ కృష్ణ, పాస్టర్ పేట్ల దాస్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-కొత్తవలస

ఆంజనేయపేటలో ఉన్న చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమంలో బోణి సత్యవతి, బంగారునాయుడు దంపతులు సోమవారం అన్నదానం ఏర్పాటుచేశారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన బోణి సత్యవతి తండ్రి నల్లి అప్పలసూర్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లి బంగారు చంద్రశేఖర్, నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, మద్దిల ప్రసాద్, సంస్థ వ్యవస్థాపకులు బోజంకి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

రాము కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ గ్రామానికి చెందిన జామి రాము ఇటీవల విజయనగరంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సభకు వెళుతుండగా గుండె పోటుతో మృతిచెందాడు. ఎన్ఆర్ఐ గొంప కృష్ణ సోమవారం ఆ గ్రామానికి చేరుకొని రాము కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు రూ.10 వేలు, కొత్తవలస మండల అధ్యక్షులు గొరపల్లి రాము రూ.5 వేలు చొప్పున బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ కృష్ణ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో పర్యటించి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సాయం చేస్తానని ఎలిపారు. కార్యక్రమంలో తెలుగు మహిళా మండల అధ్యక్షులు గుమ్మడి భారతి, టిడిపి నాయకులు సేనాపతి గణేష్, సిరికి రమణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న గొంప కృష్ణ

రీసర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-కొత్తవలస

భూమి సర్వే పనులకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహశీల్దార్ ఎం.అప్పారావు కోరారు. మండలంలో కంటకాపల్లి, ఉత్తరాపల్లి, దత్తి, దేవాడ గ్రామాలకు సంబంధించి సోమవారం గ్రామసభ ఏర్పాటుచేశారు. బుధవారం నుంచి చేపట్టనున్న సర్వేకు రైతుల వద్ద ఉన్న ఆధారాలు తీసుకుని వచ్చి, సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. భూ కమతాల చిక్కులు, ఇతర విషయం తెలుసుకుని సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భూమి సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో రైతులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. సమావేశంలో మండల సర్వేయర్ గంగాధర్, విఆర్ఒ కాకర మల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మాధవి లత, సర్వేయర్ చంద్రశేఖర్, కంటకాపల్లి గ్రామ నాయకులు మదిన అప్పలరాం, మదిన ప్రకాష్, పిఎస్ఎన్ పాత్రుడు,తదితరులు పాల్గొన్నారు.

కంటకాపల్లిలో భూ సర్వేపై ప్రజలకు విస్తరిస్తున్న మండల సర్వేయర్ గంగాధర్